క్లుప్తంగా

నేడు మహాకుంభాభిషేకం

మదనపల్లె : మండలంలోని శ్రీనేలమల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణ తెలిపారు. ప్రతి ఏడాది కార్తీకమాసం చివరి సోమవారం కుంభాభిషేక మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా పవిత్ర కుమారనది నుంచి శుద్ధజలాన్ని ఊరేగింపుగా తెచ్చి స్వామి వారిని అభిషేకించనున్నట్లు చెప్పారు. అభిషేక జలంలో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. కుంభాభిషేక మహోత్సవానికి మదనపల్లె ఆర్టీసీ డిపో అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు.

ఏకగ్రీవంగా ఎస్టీయూ మండల కమిటీ

పీలేరు : రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) పీలేరు మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎంఎస్‌ఆర్ మినీ ఫంక్షన్ హాల్ నందు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల గౌరవాధ్యక్షులుగా సూర్యనారాయణ, అధ్యక్షులుగా కొల్లు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బాల వెంకటరమణ, ఆర్థిక కార్యదర్శిగా ఎస్. అన్సర్ ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుసూదన, లోకనాథరెడ్డి, శివారెడ్డి, మహేశ్వరరెడ్డి, రాజారెడ్డి, జనార్దన్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వైవి. రమణ తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్‌చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఆదివారం మండలంలోని ముష్టూరు పంచాయతీ గౌనిగారిపల్లె గ్రామసమీపంలో స్థానికుడైన శ్రీరాములు(60) సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతడి వద్ద నుంచి 12 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

తంబళ్లపల్లె: నాటుసారా అమ్ముతున్న ఓ మహిళను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆర్‌ఎన్ తండాకు చెందిన బి.నాగమ్మ (56) నాటుసారా విక్రయిస్తుండగా ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ధాత్రి పూజ

మదనపల్లె సిటీ: కార్తీకమాసం పురస్కరించుకుని స్థానిక చిత్తూరురోడ్డు వలసపల్లి వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ధాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి హోమాలు చేశారు. ఉసిరిచెట్టు వద్ద మహిళలు దీపాలు పెట్టి పూజలు చేశారు. వనభోజన కార్యక్రమానికి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అందరూ కలిసి ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ఓంప్రకాష్, ఉపాధ్యక్షులు గిరిధర్, కార్యదర్శి దేవతా సతీష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె సిటీ: కర్నూలులో జరిగిన దక్షిణ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మదనపల్లె ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు కరాటే కటా, కుమితే విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో 33 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 25 మందికి బంగారు పతకాలు, 20 రజిత పతకాలు, 15 కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల యాజమాన్యం అమృత, శ్రీదేవి, ప్రిన్సిపాల్ షహనాజ్,కరాటే మాస్టర్ సదాశివ తెలిపారు. విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనమహోత్సవం

పీలేరు రూరల్ : మండలంలోని దొడ్డిపల్లె పంచాయతీ శివరామపురంలో వెలసిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో గాయత్రీ బ్రహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం, గణపతి హోమం , రుద్రహోమం, పూర్ణాహుతి, మంగళహారతి నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలు ఉద్యా ఫణీంద్రశర్మ ఇంటి వద్ద నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లారు. భ్రమరంబా సమేత మల్లికార్జున స్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం అన్నధాన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులు తెనాలి శేషగిరిరావు, తెనాలి రామసుబ్రమణ్యం, ఉద్యా ఫణీంద్రశర్మ, ఆలూరు ఆదినారాయణవర్మ, రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష దీపోత్సవం

పెద్దతిప్పసముద్రం మండలంలోని అంకిరెడ్డిపల్లి సమీపంలో వెలసిన శ్రీ భైరవేశ్వరస్వామి ఆలయంలో సోమవారం లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కనుల పండువగా జరిగే కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

సారాపై పోలీసుల ఉక్కుపాదం




నక్కలదిన్నె తండాలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ వలీబాషా , బండకిందతండాలో స్వాధీనం చేసుకున్న తుమ్మచెక్కను దహనం చేస్తున్న పోలీసులు

- కార్డెన్‌సెర్చ్‌లో 1,300 లీటర్ల సారా ఊట ధ్వంసం
- 13 ద్విచక్రవాహనాలు, 15 బస్తాల తుమ్మచెక్క స్వాధీనం
- చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే జిల్లా బహిష్కరణ

మదనపల్లె : మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలో నాటుసారా తయారీ స్థావరాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు డీఎస్పీ కేశప్ప ఆధ్వర్యంలో ఆదివారం మదనపల్లె పట్టణంలోని నక్కలదిన్నెతాండా, మండలంలోని నారమాకులతండా, ముదివేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎర్రమరెడ్డివారిపల్లె, ములకలచెరువు సర్కిల్ పరిధిలో విస్తృతంగా కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. తనిఖీల్లో 66 లీటర్ల నాటుసారా, సారా తయారీకి ఉపయోగించే తుమ్మచెక్క 15 బస్తాలు, రికార్డులు సక్రమంగా లేని 13 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని, సుమారు 1,300 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ...మదనపల్లె సబ్‌డివిజన్ పరిధిలో పలుసార్లు నాటుసారా స్థావరాలపై దాడులు చేసి కొంతమందిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. వీరితో పాటు మత్తు పదార్థాలు విక్రయించే వారిపై కఠినచర్యలు తీసుకున్నామన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు కొంతమందికి జిల్లాబహిష్కరణ శిక్ష విధించామన్నారు. సారా తయారీని మానుకోవాలని, రికార్డులు లేని ద్విచక్రవాహనాలను తమ వద్ద ఉంచుకోవడం చేయవద్దన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటేనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు. కార్డెన్‌సెర్చ్ దాడుల్లో సీఐలు వలీబాషా, శేఖర్, శివాంజనేయులు, మధు, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బండకింద తండాలో పోలీసుల కార్డెన్ సర్చ్

పెద్దమండ్యం: మండలంలోని రామానాయక్‌తండా పంచాయతీలోని బండకిందతండాలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి కృష్ణారావు ఆదేశాల మేరకు ములకలచెరువు సీఐ టి మధు ఆధ్వర్యంలో నలుగురు ఎస్‌ఐలు, సిబ్బందితో వెళ్లి తండాలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. వెయ్యిలీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసి, 15 బస్తాల తుమ్మచెక్కను స్వాధీనం చేసుకుని అక్కడే దహనం చేశారు. అలాగే 40 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఎటువంటి రికార్డులు లేని ఏడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా 3 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌లు రామాంజనేయుడు, గీత, లోకేష్ రెడ్డి, రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కురబల్లో రాజకీయ చైతన్యం దిశగా కృషి

మదనపల్లె : కురుబల్లో రాజకీయ చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా ఏపీ కురుబ, కురుమ, కురువ సంఘం పనిచేస్తోందని రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని కురబసంఘం రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం ఏర్పడి ఏడు వసంతాలు పూర్తిచేసుకుని, 8వ వార్షికోత్సవంలోకి అడుగిడుతున్న సందర్భంగా ఈనెల 26న మదనపల్లెలోని రామతులసీ కన్వెన్షన్ సెంటర్‌లో వేడుకలు, జనరల్‌బాడీ మీటింగ్‌తో పాటుగా భక్తశ్రేష్ట కనకదాస 536వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. పై కార్యక్రమాలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి కురుబకుల ప్రజాప్రతినిధులు, కులపెద్దలు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలకు పెద్దపీట వేస్తూ రాజకీయంగానే కాకుండా ఆర్థికంగా వారి ఎదుగుదలకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఐదేళ్లపాటు కురబ కులానికి చెందిన వారిని మంత్రిగా కొనసాగించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తిరుపతిలో కురబకుల బాంధవుడైన కనకదాస భవనం, పీఠం, హాస్టల్ నిర్మాణానికి 5 ఎకరాల భూమిని కేటాయించాల్సిందిగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతిచేశామన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కురుబ సంఘం ఆధ్వర్యంలో పదిమందితో ఎన్నికల కమిటీని ఏర్పాటుచేసి, రాష్ట్రంలోని అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులను కలిసి తమ కులానికి ఇవ్వాల్సిన వాటాను డిమాండ్ చేస్తామన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు జబ్బల చంద్ర, జబ్బల రవి, జబ్బలరెడ్డెప్ప, పట్టణ అధ్యక్షులు గుడి రామాంజులు, కే.ఓబన్న, చిన్నప్ప, గుడే శ్రీనివాసులు, అక్కులప్ప, ఎంపీటీసీ జగదీష్, సాంబ తదితరులు పాల్గొన్నారు.



కనకదాస జయంతి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కురబ సంఘం నాయకులు

సామాజిక సేవ కార్యక్రమాలు చేయాలి

మదనపల్లె సిటీ: శంకర బ్రహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక సేవ కార్యక్రమాలు చేయాలని ఆ సంఘ అధ్యక్షులు వి.కోదండరామయ్య అన్నారు. ఆదివారం మదనపల్లె పట్టణం నిమ్మనపల్లె రోడ్డులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో బ్రాహ్మణ కార్తీక సంధ్య వనభోజన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణులు అందరూ కలిసి మెలిసి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. పలువురు చిన్నారులు చేసిన నృత్యాలు, సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అందరూ కలిసి మెలిసి ఉల్లాసంగా వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు కామకోటి ప్రసాదరావు , కేశవాచారి, శ్రీధర్, మధు, ప్రకాష్, రఘునందన్ పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

మదనపల్లె : అర్హత ఉన్న ఏ ఒక్కరూ సంక్షేమ పథకం లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదనే గొప్ప లక్ష్యంతో ప్రధాని నరేంద్రమోదీ వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారని ఈఓపీఆర్డీ వెంకటసుబ్బయ్య, రాజంపేట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు యల్లంపల్లె ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం మండలంలోని కోటవారిపల్లె, నారమాకులతాండా పంచాయతీల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్రల రథం పర్యటించింది. ఈ సందర్భంగా కోటవారిపల్లె సర్పంచ్ బుక్యారాజేశ్వరి, ఎంపీటీసీ బుక్యావిజయకుమారి, నాయకులు నారాయణస్వామి, నారమాకులతాండా సర్పంచ్ సునీత తదితరులు రథానికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వివక్షకు తావు లేకుండా సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ నినాదంతో 2047లోపు భారత్‌ను బాగా అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రధాని విశేషకృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా నవభారత నిర్మాణంలో అమృతకాలం విశిష్టత, వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఔన్నత్యంపై ప్రధాని సందేశాన్ని ప్రజలకు వినిపించారు. సమావేశానికి హాజరైన వారందరితో సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. ఉజ్వల పథకం కింద మహిళలకు గ్యాస్‌స్టవ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బర్నేపల్లె రవికుమార్, పూలనాగరాజ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు గ్యాస్‌స్టవ్‌లు పంపిణీ చేసిన అధికారులు

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రంగసముద్రం, రాపూరివాండ్లపల్లి సచివాలయాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. మండల స్థాయి అధికారులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు ప్రధానమంత్రి వీడీయో సందేశాన్ని ప్రజలు వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

సంపద కన్నా సంస్కారం గొప్పది

కురబలకోట: సంపాదన కన్నా సంస్కారం గొప్పదని అంగళ్లు సీయోను ప్రార్థన మందిరం ప్రధాన పాస్టర్ విక్టర్ వేదనాయకమ్ పేర్కొన్నారు. ఆదివారం ఆరాధన, బల్ల వర్తమానం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రీస్తును అనుసరించే వారే క్రైస్తవులన్నారు. ఆయనపై భయభక్తులతో నడుచుకోవాలన్నారు. దేవుని వాక్యాన్ని జీవితానికి అన్వయించుకుని నడచు కోవాలన్నారు. మాటలు, క్రియలు, నడవడిక ఇంటా బయటా దేవున్ని ప్రతిబింబాలన్నారు. సంపాదన కన్నా సంస్కారం గొప్పదన్నారు. సైతాన్‌పై పోరాడటమే క్రైస్తవ్యం అన్నారు. ఎలాంటి సమస్యలకైనా దైవ గ్రంథం బైబిల్ ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. ముఖ్యంగా వినయ విధేయతలు విశ్వాసికి మూలమన్నారు. ప్రపంచంలో ప్రేమకు మించిన మంచి గుణం లేదన్నారు. జీవిత విధానానికి వాక్యమే ఆధారం కావాలన్నారు. అనంతరం సహ ఫాస్టర్ శ్యామ్యుయేల్ మాట్లాడుతూ క్రైస్తవ జీవితమే పాపంపై పోరాటమన్నారు. భయభక్తులు కల్గిన వారికి దేవుని ఆశీస్సులు లభిస్తాయన్నారు. రానున్న క్రిస్మస్ వేడుకలకు సన్నద్ధం కావాలని కోరారు.



వాక్యోపదేశం చేస్తున్న పాస్టర్లు

సేవా గుణం అలవర్చుకోవాలి

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకోవాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సాయి నారాయణ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వృద్ధులకు, వికలాంగులకు, అనాథలకు శాలువలు, దుప్పట్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాయి నారాయణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్యక్రమం రెండు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామన్నారు. పెళ్లి, పుట్టిన రోజులు జరుపుకునే వారు సాయి నారాయణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుపుకుని, ఆకలితో అలమటిస్తున్న వారికి అన్నదానం, సాయంత్రం బ్రెడ్లు, పాలు అందించడం వలన ఎంతో మంది ఆకలి తీరుతుందన్నారు. అన్నిదానాల కన్నా అన్నదానం మిన్న అన్నారు. నిరుపేదలకు సేవ చేయడంలో అందరూ ముందుండాలన్నారు. మనకున్నంతలో తోటి వారికి సాయం చేయడం ద్వారా జీవితానికి తగిన సార్థకత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో దాతలు కనోజ్ రుక్మిణి ప్రసాద్, భారతి, సురేష్, ట్రస్టు సభ్యులు చింతల ఆనంద రెడ్డి, నీళభాస్కర్, కువైట్ శంకరాచారి, క్రిష్ణమూర్తి, సత్య, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు అందిస్తున్న ఎమ్మెల్యే చింతల

కమనీయం.. లక్ష్మీనరసింహుడి కల్యాణం

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణం వైభవం నిర్వహించారు. ఆదివారం స్వాతి నక్షత్రం కావడం, ఇదేరోజు స్వామివారి జన్మదినం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లివేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పాలతో క్షీరాభిషేకం చేశారు. పంచామృతాలకు ప్రత్యేకంగా మూలవర్లకు అభిషేకాలు కావించారు. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారి ఎదుట యజ్ఞహోమాలు నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలోఅర్చకులు గోపాలాబట్టర్, కృష్ణ, అనిల్, రాజు, గోకుల్ స్వాములు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

వాల్మీకిపురం: వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో ఆదివారం శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయంలోని కల్యాణ మండపంలో షిరిడిసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వేదపండితులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, ఉత్సవ మూర్తుల అలంకరణ చేశారు. అనంతరం వల్లిదేవ సేన సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహుని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సందర్శకులతో హార్సిలీహిల్స్‌పై సందడి

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్ సందర్శకుల తాకిడితో నిండిపోయింది. ఆదివారం కార్లు, బైక్‌లు, ఆటోలు, బస్సుల్లో సందర్శకులు కొండకు వచ్చారు. ఈ వాహనాల రాకతో రోడ్లన్నీ రద్దీగా మారిపోయాయి. సందర్శకులతో వ్యూపాయింట్లు, గాలిబండ, అటవీప్రాంగణం, పార్కులు నిండిపోయాయి. పిల్లలతో వచ్చిన కుటుంబాలు వెంట తెచ్చుకున్న భోజనాలతో విందులు చేసుకొన్నారు. వైఎస్సార్, అన్నమయ్య, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలు, కర్ణాటక, తమిళనాడు నుంచి అధికసంఖ్యలో సందర్శకులు వచ్చారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో సందర్శకులు సేద తీరారు. అటవీ సముదాయంలోని మానస సరోవరంలో బోటింగ్ ఏర్పాటు చేయడంతో బోట్లపై షికారు చేసేందుకు సందర్శకులు పోటీ పడ్డారు.

యాదవ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం

మదనపల్లె సిటీ: యాదవ ఉద్యోగుల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం స్థానిక గోవర్ధనగిరిలోని శ్రీకృష్ణ ఆలయంలో నిర్వహించారు. సంఘ కార్యవర్గ అధ్యక్షులు వెంకటయ్య, కుమార్ మాట్లాడుతూ యాదవ సొసైటీలో ఉద్యోగస్థుల పిల్లలకు, చదువు, ఉద్యోగ నైపుణ్యంలో శిక్షణ, చదువు కోసం ఉపయోగపడే పుస్తకాలు ఉచితంగా అందజేస్తామన్నారు. వారికి ఆర్థికంగా సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. సాఫ్ట్‌వేర్, సివిల్స్‌లో రాణించేవారికి ఉచితంగా శిక్షణ ఇచ్చి వారి ఉద్యోగాలు ఇచ్చే విధంగా చూస్తామన్నారు. అనంతరం యాదవ రిటైర్డు ఉద్యోగులకు సన్మానించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ ఆలయం అధ్యక్షులు శంకర్‌యాదవ్, గౌరవ అధ్యక్షులు రమణ, శ్రావణ్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజెన్స్ సమస్యలు పరిష్కరిస్తాం

మదనపల్లె సిటీ: సీనియర్ సిటిజెన్స్ సమస్యలు పరిష్కారిస్తామని ఎస్‌బీఐ మేనేజర్ మంగళగౌరి అన్నారు. ఆదివారం స్థానిక బెంగళూరు రోడ్డులోని జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో సీనియర్ సిటిజెన్స్ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఎస్‌బిఐ ద్వారా ఉత్తమ సేవలు అందిస్తామన్నారు. వచ్చే నెలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు మునిగోపాలకృష్ణ, ఉపాధ్యక్షురాలు శకుంతలమ్మ, జగన్‌మోహన్, రమణ, ధనలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌ను సన్మానించారు.

బలహీన వర్గాలు రాజకీయ చైతన్యం చెందాలి

పీలేరు : బడుగు, బలహీన వర్గాలు రాజకీయ చైతన్యం చెందాలని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.టి.ఎం. శివప్రసాద్ అన్నారు. ఆదివారం పీలేరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో 'రూల్ ఆంధ్రా' పేరుతో వీసీకే పార్టీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ఏడు శాతం ఓట్లు కల్గిన అగ్ర వర్ణాల వారు ఏడు దశాబ్దాలుగా రాష్ట్రాన్ని పాలిస్తున్నారని తెలిపారు. సామాజిక సంక్షేమం, సమగ్రాభివృద్ధి జరగాలంటే మెజారిటీ ప్రజలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపుల నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడాలని కోరారు. రాబోయే ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి అన్ని జిల్లాలో ×రూల్ ఆంధ్రా౯ చైతన్య సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. వీసీకే పార్టీ అధినేత డాక్టర్ తిరుమావళవన్ నేతృత్వంలో తమిళనాడులో ఇద్దరు ఎంపీలు, నలుగురు ఎమ్మెల్యే, 1050 మంది స్థానిక సంస్థల ప్రతినిధులు ఉన్నాని తెలిపారు. ఏపీలో కూడా వీసీకే పార్టీని అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు పాలకుంట శ్రీనివాసులు, డాక్టర్ సి. చంద్రయ్య, గణపతి, కె.వి. రమణ, మోహన్, తాతయ్య, టి.ఎ. పీర్‌బాషా, ముల్లంగి కృష్ణయ్య, నాగరాజ, మల్లికార్జున, నారాయణ, రమణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

మదనపల్లె : ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 27 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలోకి వెళుతున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి వర్రి సురేష్‌కుమార్ చెప్పారు. ఆదివారం ఏఐటీయూసీ జిల్లాసమితి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ..మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను రాష్ట్రప్రభుత్వం పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు సంబంధించి జీఓ 30 సవరించి, స్కిల్డ్, అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు పెంచాలన్నారు. డ్రైవర్లకు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్లకు, ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే పార్క్‌వర్కర్లు, స్కూల్‌స్వీపర్లకు హెల్త్ అలవెన్సులు అందించాలన్నారు. కనీసవేతనం రూ.26 వేలు చెల్లించాలని, కరోనా విపత్తులో పనిచేసి మరణించిన కార్మిక కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. మస్టర్ పాయింట్ల దగ్గర మరుగుదొడ్లు, పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు విశ్రాంతిభవనం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మస్తాన్, మదనపల్లె అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నాగరాజు, రత్నమ్మ, వాసు, మధు, పృథ్వీరాజ్, నాగరాజు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రెడ్డెమ్మతల్లికి గాజుల అలంకరణ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి ఘనంగా గాజుల అలంకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్తీక మాసం త్రయోదశి రోజును పురస్కరించుకొని భక్తులు, ప్రజల నుంచి గాజులను సేకరించారు. అలా సేకరించిన గాజులతో ఆదివారం ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈసందర్భంగా వేకువజామునే అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పంచామృ తాభిషేకం వైభవంగా నిర్వహించారు. సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలకు ప్రత్యేకంగా అలంకరించిన గాజులను ప్రసాదంగా పంపిణీ చేశారు.

గుంటి గంగమ్మకు దీలుబోనాలు

వాల్మీకిపురం: మండలంలోని చింతపర్తి బాహుదానది ఒడ్డున వెలసిన గుంటి గంగమ్మకు కార్తీక మాసం చివరి ఆదివారం మహిళలు దీలుబోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి తెల్లవారి జామున అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణ రెడ్డి, గ్రామస్థులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.